

మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న డీకే రాములు అతడి అనుచరులు

# రేవంత్ ఓటమి ఖాయం

- నీవు చెప్పే అబద్ధాలను కొడంగల్ ప్రజలు నమ్మరు
- ఎన్నడూ రానోడికి ఓటు అడిగే హక్కులేదు
- నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు పట్నం నరేందర్‌రెడ్డి
- కోస్గి సమావేశంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- 9న నామినేషన్.. కొడంగల్‌కు మంత్రి కేటీఆర్ రాక
- పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు
- కొడంగల్ పట్టణంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల బీఆర్‌ఎస్ శ్రేణుల సమావేశం

కోస్గి, నవంబర్ 7 : రానున్న ఎన్నికల్లో కొడంగల్ నుంచి పట్నం నరేందర్‌రెడ్డి రెండోసారి భారీ మెజార్టీతో గెలవడంతోపాటు.. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి కూడా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కోస్గి మున్సిపల్‌లోని ఫామ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశానికి మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..అబద్ధాల రేవంత్‌రెడ్డి.. నీవు ఓడిపోవడం ఖాయమని..నీ కల్లబొల్లి మాటలను కొడంగల్ నియోజకవర్గ ప్రజలు నమ్మరన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు ఎన్నడూ రాని రేవంత్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం చేసి పట్నం నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ఓటమి చెందుతారన్నారు. నిన్న పీసీసీ అధ్యక్షుడు కొడంగల్‌లో పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. ఐదేండ్ల కాలంలో సెగ్మెంట్‌లో వందల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు వివరించారు. దౌల్తాబాద్‌కు జూనియర్ కాలేజీ వచ్చి ప్రారంభమైన విషయం కూడా అతడికి తెలియదని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా మహబూబ్‌నగర్– చించోలి హైవే పనులు ప్రారంభమై తుది దశకు చేరుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పే అబద్ధాలను ఇక్కడి ప్రజలు నమ్మరన్నారు. 'కొడంగల్‌లో నామినేషన్ వేసి వెళ్తా ..నన్ను గెలిపించండి అని పీసీసీ అధ్యక్షుడు మాట్లాడిన మాటలపై నరేందర్‌రెడ్డి వ్యగ్యంగా స్పందించారు. ఓటు అడిగేందుకు రానోడు ప్రజలకు ఏమి చేస్తాడని. సమస్యలను ఎలా పరిష్కరిస్తారన్నారు.'
ఈనెల 9న తాను నామినేషన్ వేసే కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ కొడంగల్‌కు వస్తున్నందున అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారు. కాగా కోస్గి మున్సిపల్ పరిధిలోని జాంగ్ర కమ్యూనిటీ హాల్‌లో టీడీపీకి చెందిన రాములు, తన అనుచరులు వందమందితో కలిసి మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ ఐదేండ్ల కాలంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సెగ్మెంట్ అన్ని రంగాల్లోనూ వెనుకబడిందన్నారు. అంతకుముందు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామకృష్ణ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి తినిపించారు. అనంతరం అతడికి వారు శుభాకాంక్షలు చెప్పా రు. కార్యక్రమంలో మాజీ స్టోర్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేణుగోపాల్, కౌన్సిలర్లు శ్రీను, బాలేశ్, జనార్దన్ రెడ్డి, బందెప్ప, మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, నాయకులు ఓంప్రకాష్, వరప్రసాద్, రాజేందర్‌రెడ్డి, అమృతమ్మ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో అభివృద్ధిని పరుగులు పెట్టించాం

బొంరాస్‌పేట, నవంబర్ 7: గడిచిన ఐదేండ్లలో కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించామని .. కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి గ్రామాలు, తండాలను ప్రగతిపథంలో నిలిపినట్లు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 9న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్న సందర్భంగా మంగళవారం కొడంగల్ పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో రైతులు, మహిళలు, ఉద్యోగులు, యువత కోసం అనేక పథకాలను అమలు చేసిందని.. కుల వృత్తుల వారు గౌరవప్రదంగా జీవించేందుకు కోట్లాది రూపాయల ఆర్థిక సాయం చేసిందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించి నీటి ఎద్దడిని శాశ్వతంగా నిర్మూలించామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దండగన్న వ్యవసాయాన్ని సీఎం కేసీఆర్ పండుగలా చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేయాలని యత్నిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ నెల 9న మంత్రి కేటీఆర్ హాజరవుతున్న కార్యక్రమానికి బొంరాస్‌పేట, దుద్యాల మండలాల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని మంత్రి మహేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కోట్ల యాదగిరి, చాంద్‌పాషా, బొంరాస్‌పేట మండల ఇన్‌చార్జి రాజు, వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పార్టీ నాయకులు రమణారెడ్డి, రామూనాయక్, మహేందర్, నర్సింహానాయక్, నెహ్రూనాయక్, సోంనాథ్ పాల్గొన్నారు.
కాగా బొంరాస్‌పేట మండలంలోని చెట్టుపల్లితండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు తుల్జానాయక్, శాంతీబాయి తదితరులు మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

### పోస్టల్ బ్యాలెట్ ద్వారా
## ఓటుహక్కును వినియోగించుకోవాలి



వికారాబాద్, నవంబర్ 7: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు బుధవారం సాయంత్రం 5:00 గంటల వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు ఫారం–12 డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 80 ఏండ్లు నిండిన వయోవృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు అలాగే అత్యవసర సేవలు అందించే వైద్యారోగ్య, విద్యుత్తు, సమాచార, పౌర సంబంధాలు, రైల్వే, పోస్టల్ శాఖల అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సీ- విజిల్ యాప్‌ను వినియోగించాలి



ఇబ్రహీంపట్నం, నవంబర్ 7 : శాసనసభ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు సీ–విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ భారతి హోలీకేరీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఓటర్లను ప్రలోభపెట్టినా..భయపెట్టినా.. బలవంతంగా ప్రభావితం చేసిన సీ–విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చన్నారు. ఫిర్యాదు అందించిన 100 నిమిషాల్లోనే సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సీ–విజిల్ యాప్ ప్రజలకు బ్రహ్మాస్త్రం లాందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరూ సీ –విజిల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సమస్యను కెమెరా ఆన్ చేసి ఫొటో లేదా వీడియో తీసి సమస్యను సంక్లిప్తంగా టైప్‌చేయి పంపించాలన్నారు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అంతేకాకుండా రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూం నంబర్ 040–23238545కు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

## నాలుగోరోజు 29 నామినేషన్లు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 7: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నాలుగోరోజు రంగారెడ్డి జిల్లాలో మంగళవారం 29 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేశారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు పలువురు ఇండిపెండెంట్లు ఉన్నారు. మంగళవారం నామినేషన్లు దాఖలు చేసినవారిలో షాద్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ కూడా ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌తోనే..
# గొల్ల,కురుమల సంక్షేమం

**కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

ఆమనగల్లు, నవంబర్ 7: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గొల్ల, కురుమల మనుగడ అంధకారమేనని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నియోజకవర్గ గొర్రెల కాపరుల ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్‌ఎస్ కల్వకుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గె మల్లేశం, గొల్ల, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలరాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చేది లేదని వాటిని బంగాళాఖాతంలో కలపాలన్నారు. గుజరాతీ, ఢిల్లీ గులామ్‌లను తరిమికొట్టాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్నీ సీఎం కేసీఆర్ అమలు చేస్తారని స్పష్టం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 10,444 యూనిట్లకు మొదటి విడుతగా 5027 యూనిట్లను గొల్ల,కురుమల కుటుంబాలకు రూ.64కోట్ల 31 లక్షలు ఖర్చు చేసి అందించినట్లు వివరించారు. మిగిలిన యూనిట్లను అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ అమలు చేస్తారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల, కురుమల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నదన్నారు. సర్వేలన్నీ బీఆర్‌ఎస్ పార్టీకే అనుకూలంగా ఉన్నాయని మారోసారి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. అనంతరం ఎగ్గె మల్లేశం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తైతే కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికీ నీరు అందుతుందన్నారు. కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డిలకు రాజకీయ విలువలుంటే వెంటనే తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలవడం సాధ్యంకాదని ముందుగానే పసిగట్టిన వంశీచంద్‌రెడ్డి తన సీటును కసిరెడ్డికి ఇచ్చాడని ఎద్దేవా చేశాడు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు.
అనంతరం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గొల్ల, కురుమల కుటుంబాలకు అండగా ఉన్నారన్నారు. బీఆర్ ఎస్‌తోనే గొల్ల, కురుమల సంక్షే మం సాధ్యమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని పథకాలను నిలిపేసినా సీఎం కేసీఆర్ మాత్రం గొల్ల, కురుమలపై ఉన్న ప్రేమతో గొర్రెలను పంపిణీ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డిని అడుగడుగునా అడ్డుకోవాలని కార్యకర్తలు, ప్రజలకు సూచించారు. కాగా మడ్గుల మండలంలోని పెద్ద మడ్గుల–నర్సాయిపల్లి మధ్యలో 2003 నవంబర్7న నాపై నక్సల్స్ కాల్పు లు జరపగా నియోజకవర్గ ప్రజల దీవెనతో బతికినట్లు ఆయన చెప్పారు. మీ బిడ్డగా ఆశీర్వదించి.. మరోసారి అవకాశమిస్తే నా జీవితాన్ని నియోజకవర్గ ప్రజలకు అంకితం ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ గిరియాదవ్, రై,స,స అధ్యక్షుడు నిట్ట నారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, రాములుయాదవ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖలీల్, యాదవ సంఘం నాయకుడు కృష్ణయాదవ్, కడ్తాల్ ఉప సర్పంచ్ రామకృష్ణ, పెద్దయ్యయాదవ్, నరేశ్‌యాదవ్, వరుణ్, రాజేందర్‌యాదవ్, శ్రీను, శ్రీను యాదవ్, సురేశ్‌యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, చిత్రంలో ఎగ్గే మల్లేశం, క్యామ మల్లేశ్, బీఆర్‌ఎస్ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్